ఆరు జిల్లాలకు హైవేల లింకు



• మహారాష్ట్రకు సైతం రాజమార్గం • జిల్లా కేంద్రంగా నాలుగు జాతీయ రహదారుల వలయం



నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి భైంసా వరకు జరుగుతున్న జాతీయ రహదారి 161 బీబీ నిర్మాణం

నిర్మల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంగా ఆరు జిల్లాలకు జాతీయ రహదారుల లింకు ఏర్పడబోతోంది. దీంతో పాటు ఈ ఆరు జిల్లాలకు ఆనుకొని ఉన్న మహారాష్ట్రకు సైతం కొత్తగా రూపొందుతున్న జాతీయ రహదారులతో మహారాష్ట్రకు రాజమార్గం ఏర్పడబోతోంది. ఇప్పటికే హైదరాబాద్ - నాగ్‌పూర్ 44వ నంబర్ జాతీయ రహదారి నిర్మల్ గుండా వెళుతున్న సంగతి తెలిసిందే. ఈ రహదారి కారణంగా మార్గమధ్యలో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లాలకు మహారాష్ట్రతో లింకేజీ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కాగా ఇటీవల మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి భైంసా మీదుగా నిర్మల్ వరకు కూడా జాతీయ రహదారి పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోవడమే కాకుండా మహారాష్ట్రలోని ధర్మాబాద్, నాందేడ్, ఔరంగాబాద్, జాల్నా, పర్బని లాంటి నగరాలకు లింకేజీ ఏర్పడింది. కాగా ఇటీవలే బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు 161 హైవే బీబీరోడ్డు పేరిట పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు 388 కోట్లతో ఈ రోడ్డు పనులను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 60శాతానికి పైగా రోడ్డు పనులు పూర్తయ్యాయి. జిల్లా పరిధిలో 30 కిలోమీటర్లు, నిజామాబాద్ జిల్లా పరిధిలో 26.4 మీటర్ల పొడవుతో ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ జాతీయ రహదారి హైదరాబాద్ నుంచి మద్నూర్ వెళ్లే రోడ్డుకు కనెక్ట్ కానుంది. దీంతో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు అటు మహారాష్ట్రతోనూ ఇటు కర్ణాటకకు రోడ్డు మార్గం ఏర్పడనుంది. అలాగే ఎన్‌హెచ్ - 61 పేరిట నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు రూ. 140 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటికే నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు రోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ రోడ్డుపై ఏడుచోట్ల రూ.40 కోట్లతో అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని చల్‌గల్ వద్ద ఈ రోడ్డుకు కనెక్ట్ కానుంది. దీంతో ఇటు కరీంనగర్ అటు మంచిర్యాల జిల్లాలకు కూడా కనెక్టివిటీ ఏర్పడుతోంది. మొత్తానికి జిల్లా కేంద్రంగా ఆరు జిల్లాలకు నాలుగు నేషనల్ హైవేలు అనుసంధానం కావడంతో రోడ్డు రవాణా రంగమే కాకుండా వాణిజ్య వ్యాపార రంగాలు అభివృద్ధి చెందేందుకు దోహదపడనుందని అంటున్నారు.

పొరుగు రాష్ట్రాలకు హైవేలతో లింకేజీ

జిల్లాకు కనెక్టయిన నాలుగు హైవేలతో పొరుగు రాష్ట్రాలకు రవాణా మార్గం ఏర్పడనుంది. ఇప్పటికే ఉన్న నేషనల్ హైవే నంబర్ 44తో మహారాష్ట్రకు రోడ్డుమార్గం కొనసాగనుండగా మరో మూడు హైవేలతో కర్ణాటక, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కూడా లింకేజీ ఏర్పడబోతోందని అంటున్నారు. హైవేల అనుసంధానంతో తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు కూడా పొరుగు రాష్ట్రాలతో కనెక్టివిటీ పెరగబోతోందంటున్నారు.

బాసర గోదావరిపై కొత్త బ్రిడ్జి..

ఇదిలా ఉండగా 161 బీబీ హైవే రోడ్డులో భాగంగా బాసర వద్ద గల గోదావరినదిపై మరో బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ నదిపై ఓ బ్రిడ్జి ఉన్నప్పటికీ జాతీయ రహదారి నిబంధనల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి పక్కనే అదనంగా మరోబ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఈ బ్రిడ్జి పూర్తయితే జాతీయ రహదారిపై ఇరువైపులా బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగనున్నాయి. దీంతో నిర్మల్ జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ సమస్య కూడా తీరనుందంటున్నారు. అలాగే రవాణామార్గం విస్తరించడంలో వాణిజ్య వ్యాపారరంగాలు సైతం అభివృద్ధి చెందే అవకాశాలు ఏర్పడనున్నాయంటున్నారు.



జాతీయ రహదారి నంబర్ 61 నిర్మాణం పనులు జరుగుతున్న దృశ్యం

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

• జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజేందర్


ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ రాజేందర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 18 : జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010, నియమ నిబంధనలు 2022 ప్రకారం ఆసుపత్రులను నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రాజేందర్ ఆదేశించారు. బుధవారం ఆయన పలు ఆసుపత్రులు ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి ఆసుపత్రిలో రుసుముల చార్ట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యుల పేర్లు, అర్హతల పత్రాలు ప్రదర్శించాలన్నారు. వైద్యులు మారితే జిల్లా అధికారికి సమాచారమివ్వాలన్నారు. బయో మెడికల్, వేస్ట్ మేనేజ్మెంట్ పొల్యూషన్ తదితర సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. రోగులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మీడియా అధికారి రవీందర్ ఆయన వెంట ఉన్నారు.

బాలశక్తి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

బాలశక్తి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ కోరారు. బుధవారం ఆశా మోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. పిల్లల హెల్త్ ఫైల్ రూపొందించాలని, రక్తహీనత, థైరాయిడ్, పోషకాహారాలు, తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డాక్టర్ శ్రీనివాస్, సౌమ్య, సాయమ్మ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థ యాప్ వినియోగించుకోండి

• ట్రాన్స్‌కో ఎస్ఈ బి. శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 18 : వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తెలంగాణ ఎన్పీడీసీఎల్ ప్రత్యేక యాప్ రూపొందించిందని దీన్ని ఉపయోగించుకోవాలని నిర్మల్ సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. సంఘటనలు ఏవైనా జరిగితే జీపీఎస్ లొకేషన్ ద్వారా ఫోన్‌లో ఫోటో తీసి పంపిస్తే సంబంధిత అధికారి సమస్య పరిష్కరిస్తారన్నారు. వినియోగదారుల సౌకర్యాలు, ఫిర్యాదులు, ఫిర్యాదుల స్టేటస్, సెల్ఫ్ రీడింగ్, పే బిల్స్ ఆన్‌లైన్ పేమెంట్, తదితర వాటిని పొందుపరిచారన్నారు.

సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు

కుభీర్, సెప్టెంబరు 18 : మండలంలోని కీరునాయక్ తండాకు చెందిన సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ లచ్చు(57) అంత్యక్రియలు బుధవారం పోలీసు లాంచనాయి. సోమవారం చైన్నైలో ఆయన మృతి చెందగా బుధవారం మృతదేహం గ్రామానికి చెరింది. రామగుండం నుంచి సీఐఎస్ఎఫ్ పోలసులు గ్రామానికి చేరుకొని అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 18 : ఈ నెల 19 నుండి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు డీటీడీవో అంబాజీ అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులను అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు అనూష, పీడీ భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు. సంజయ్, సందీప్, ప్రదీప్, కృష్ణ, బి. కృష్ణ పోటీల్లో పాల్గొన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని

పడక్బందీగా అమలు చేయాలి

• స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

నిర్మల్, సెప్టెంబరు 18 : బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బాలశక్తి కార్యక్రమం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు ఆరోగ్య, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన అనుభవాలు, నైపుణ్యాభివృద్ధి, సాధికారత వంటి అంశాలపై అవగాహన కల్పించడం బాలశక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం రోజున రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యచే కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందన్నారు. విద్యార్థులకు వివిధ విభాగాల్లో నైపుణ్యాలను, నిత్యజీవితంలోని రోజువారీ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 52 విద్యాసంస్థల్లో బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులకు బ్యాంకింగ్ విభాగంలో అందించు వివిధ రకాల సేవలు, సైబర్ నేరాల పట్ల అవగాహన, గ్రామ, మండల స్థాయిలో పౌరసేవలకు సంబంధించి అంశాలను వివరించడం, జిల్లా కార్యాలయాల సందర్శన, పోస్టాఫీస్, పోలీసుస్టేషన్, న్యాయస్థానం, గ్రామ పంచాయతీ, మండల కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మీ సేవ, అంగన్‌వాడీ కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, ప్రాజెక్టులు, వ్యవసాయ పరిశోధన క్షేత్రాలకు విద్యార్థులను క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లి 20 మంది బృందం చొప్పున పలు సేవల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పరచడం ద్వారా విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యాధులు, వాటి నియంత్రణ, ఒత్తిడిని జయించుట, స్వీయ రక్షణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామీణ, మండల స్థాయి అధికారులు, ఎన్జీవోలు, ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సంఘాలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. విద్య, వైద్య, ఆరోగ్య, పరిశ్రమ, లీడ్ బ్యాంక్ మేనేజర్, గ్రామీణ అభివృద్ధి, ఆశా కార్యకర్తలు, ఎన్జీవోలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమా వేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో 400ల గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులు ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 08-2024 ఓటరు జాబితా ప్రకారం జిఆల్లలో 4 లక్షల 40 వేల 997 మంది ఓటర్లుగా ఉన్నారని, అందులో మహిళ ఓటర్లు 2 లక్షల 30 వేల 836 కాగా పురుష ఓటర్లు 2 లక్షల 10 వేల 146 మంది ఉన్నారని వివరించారు. 650 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, మరణించిన, చిరునామా మారిన, ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఓటు హక్కు కలిగి ఉన్న ఫామ్-6, 8 ద్వారా సరి చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 వరకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాలలో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తుది ఓటరు జాబితా ఈ నెల 26న ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో భుజంగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, బీజేపీ నాయకులు కే.అంజుకుమార్‌రెడ్డి, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, టీడీపీ నాయకులు రమేష్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు హైదర్, బీఎస్పీ నాయకులు జగన్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు పరికిపండ్ల స్వదేశ్, తదితులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ చెరువుపై అక్రమ కట్టడాలను తొలగించాలి

• కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిర్మల్, సెప్టెంబరు 18 : ధర్మసాగర్ చెరువుపై నిర్మించిన వాకింగ్‌ట్రాక్‌ని తొలగించి, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ సరిహద్దులతో చెరువును పునరుద్ధరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సయ్యద్ మాట్లాడుతూ... ధర్మసాగర్ చెరువుపై నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను తొలగించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను పరిగణలోకి తీసుకొని చెరువును విస్తరించి సంరక్షించాలి. చెరువును పూడ్చి నిర్మించిన వాకింగ్ ట్రాక్‌తో నీటి నిల్వల స్థాయి తగ్గిపోయింది. దీంతో వేసవి కాలంలో భూగర్భ జలాలు పాతాళానికి చేరుతున్నాయి. గాజులపేట్ ప్రాంతంలో నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోట్లు వెచ్చించి నిర్మించిన వాకింగ్ ట్రాక్‌తో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయమ్మైంది. రాత్రి వేళలో లైట్లు వెలగడం లేదు. పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. మందు బాబులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. చెరువుకట్టను ఆనుకునే నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ఇబ్బందికర పరిస్థితిలు ఎదురయ్యే అవకాశం ఉంది. ధర్మసాగర్ చెరువును వ్యవసాయ సాగుకోసం, భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించారు. పట్టణ విస్తరణలో భాగంగా చెరువు నడిబొడ్డులోకి వచ్చింది. చెరు వుపై నిర్లక్ష్యం చేయడంతో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. బఫర్‌జోన్, ఎఫ్‌టీ ఎల్ లాంటివి పట్టించుకోకుండానే అధికారులు అండదండగా ఉండడంతో నిర్మా ణాలు జరిగాయి. దీంతోపాటు చెరువును అభివృద్ధి చేస్తామంటూ కోట్ల రూపా యలు ఖర్చు చేసి చెరువు సరిహద్దును కుదించి ట్రాక్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ దాని నిర్వహణ బాధ్యతను విస్మరించడంతో ప్రస్తుతం అది ప్రజలకు వినియోగకరంగా ఉండడం లేదు. పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాని వాకింగ్ ట్రాక్‌ను తొలగించి చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలి. హైదరాబాద్ తరహాలో చెరువులను సంరక్షించాలి. చెరువు సహజత్వాన్ని కాపాడాలి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను పరిగణలోకి తీసుకొని చెరువును పునరుద్ధరించాలి. చెరువులోకి వచ్చే కాలువలు, అలాగే చెరువు నీటిని బయటకు తీసుకెళ్లే కాలువలను పునరుద్ధరించి చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరడం జరిగింది. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.

ఉడుముతో కొంపముంచిన ఇన్‌స్టా రీల్

• ఉడుముతో ఆట తెచ్చిన చేటు కొంపముంచిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ • ఉడుముతో ఆడుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసిన యువకుడు
• ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో వీక్షించిన జంతు ప్రేమికుల ఆగ్రహం • అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు యువకుడిపై కేసు నమోదు


ఆకొండపేట్ గ్రామశివారులోని అడవిలో వేటాడిన స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

దస్తురాబాద్ రూరల్, సెప్టెంబరు 18 : డిజిటల్ యుగంలో సరదా కోసం చేసే వీడియోలు జైలు పాలు చేసిన ఘటన మండలంలోని ఆకొండపేట్ గ్రామంలో చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట్ గ్రామానికి చెందిన మాదుగుల రాధాకృష్ణ(29) అనే యువకుడు అటవీప్రాంతం సమీపంలో ఉన్న తన సొంత పొలంలో సరదాగా వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు పోస్ట్ చేస్తుంటాడు. అదే విధంగా గత నెల 4వ తేదీన అటవీ ప్రాంతంలో ఉడుమును వేటాడిన వీడియోను పోస్ట్ చేశాడు. ఈ వీడియోను చూసిన కరీంనగర్ జిల్లాకు చెందిన ఎన్నారై అదులాపురం గౌతం స్ట్రే యానిమల్ ఫౌండేషన్‌కు చెందిన ఎన్జీవో అధికారికి సమాచారం అందించగా, ఢిల్లీ నుంచి జిల్లా అటవీశాఖ అధికారికి లేఖ ద్వారా ఈ నెల 17న ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం కడెం మండల క్షేత్రస్థాయి అధికారి గీతారాణి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. యానిమల్ యాక్ట్ కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


బీరయ్య మృతదేహం

ఖానాపూర్, సెప్టెంబరు 18 : మేకకు మేత తీసుకురావడానికి వెళ్లి ఓ రైతు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన కడెం మండలం సారంగాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడెం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... సారంగాపూర్ గ్రామానికి చెందిన ఎగుర్ల బీరయ్య(78) అనే రైతు తన మేకకు మేత తీసుకురావడానికి ఉదయం ఇంట్లోంచి బయలుదేరాడు. గ్రామశివారులోని మార్కపు రాజన్న ఏడు వద్ద ఉన్న టాన్స్‌ఫార్మర్ సమీపంలో మేక కోసం మేతను సేకరిస్తున్న ఎగుర్ల బీరయ్య ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు అల్లుకున్న మొక్కను లాగే ప్రయత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు అతని కుమారుడు రాజేందర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కడెం పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మేకల కాపరి మృతి

తానూర్ రూరల్, సెప్టెంబరు 18 : మండల కేంద్రం తానూర్ గ్రామానికి చెందిన మేకల కాపరి యాసీర్‌ఖాన్(19) ప్రమాదవశాత్తు కాలుజారీ చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడి తండ్రి మోహిన్‌ఖాన్‌కు అనారోగ్యం కారణంగా యాసీర్‌ఖాన్ బుధవారం ఉదయం మేకలను మేపుకరావడానికి మరో వ్యక్తి అతిక్‌తో కలిసి వెళ్లారు. మధ్యాహ్నం చెరువు ఒడ్డు వద్ద మేకలను కడుగుతుండగా యాసీర్‌ఖాన్ ప్రమాదవశాత్తు కాలుజారీ చెరువులో పడిపోయాడు. ఈ విషయాన్ని అతిక్ గ్రామస్థులకు తెలియజేయగా గ్రామస్తులు అతన్ని బయటకి తీసి చూసే సరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ.50 వేల నగదు అపహరణ



భైంసా, సెప్టెంబరు 18 : పట్టణంలోని హస్గుల్‌రోడ్డు మార్గంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు ఠాగూర్ జమదగ్నిసింగ్ తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం బాధిత కుటుంబం ఇంటికి తాళం వేసి ఆదిలాబాద్ వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చి ఇంటికి రాగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులకొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని బీరువా పగుల కొట్టి అందులోని సామాను అంతచిందరవందరగా పారవేసి ఉండటంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. ఇంట్లోకి చొరబడ్డ దొంగలు బీరువాలో దాచిపెట్టి ఉంచిన రూ.50 వేల నగదుతో పాటు కొన్ని ఇతర వస్తువులు అపహరించుకపోయినట్లుగా గుర్తించారు. అంతేకాకుండా ఇంటికి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా పుటేజీ హార్డ్ డిస్కును సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. దీంతో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి చోరీ విషయంలో బాధితుడు ఠాగూర్ జమదగ్ని సింగ్ ఫిర్యాదు చేయగా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి మొక్కల పట్టివేత

నార్నూర్, సెప్టెంబరు 18: గాదిగూడ మండలం ఖడ్కికోలాంగూడ గ్రామంలో బుధవారం పోలీసు సిబ్బంది రూ. లక్షా ఆరువేల విలువగల గంజాయి మొక్కలను పట్టుకున్నారు. ఉమ్మడి మండల సీఐ రహీంపాషా తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు ఉమ్మడి నార్నూర్ మండలంపై మత్తుపదార్థాల విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్న సందర్భంగా గాదిగూడ ఎస్సై మహేశ్ అందించిన సమాచారం మేరకు బుధవారం ఖడ్కి గ్రామం పంట పొలాల తనిఖీలు ముమ్మరం చేశారు. మడావి జైతు 39 అనే రైతు చేనులో 106 గంజాయి మొక్కలు ఉన్నట్లుగా గుర్తించారు. వీటి ధర ఒక మొక్కకు రూ. వెయ్యి చొప్పున లక్షా ఆరువేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి అతని రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మావల, సెప్టెంబరు 18: పట్టణంలోని ఓ వివాహిత అదృశ్యమైనట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రాంనగర్ కాలనీకి చెందిన వివాహిత(23) పుట్టింటికి వెళ్లి వస్తానని బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలు దేరింది. కాగా ఆమె అక్కడికి చేరుకోకపోవడంతో బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కళాశాలలో హిందీ అధ్యాపకున్ని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ దివస్

ఉట్నూర్, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, హిందీ భాషా గొప్పతనం గురించి వివరించారు. అనంతరం హిందీ అధ్యాపకుడు గణేష్, వక్తలు హిందీ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు గణేష్‌ని విద్యార్థులు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హిందీ భాషపైన వ్యాస రచన ఉపన్యాస పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు హిందీ అధ్యాపకులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, వినోద్, లక్ష్మణ్, సుజాత, తిరుపతి, నవీన్, కిషోర్, రూప, అధ్యాపకేతరులు మల్లేష్, ప్రకాష్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ఎస్సై, ఏఎంసీ చైర్మన్లు

గణేష్ మండలి వద్ద అన్నదానం

బోథ్, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని హంటర్స్ యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, స్థానిక ఎస్సై ప్రవీణ్‌లు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శేఖర్, రజియాతో పాటు గణేష్ మండలి యకువకులు, మహిళలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బోథ్, సెప్టెంబరు 18: మండలంలోని పిప్పలదరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొడసం భూమన్న ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి బుధవారం పిప్పలదరి గ్రామానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబీకులకు భరోసా కల్పించారు.

ఇచ్చోడలో గంగమ్మ ఒడికి గణనాథులు



ఇచ్చోడ శోభాయాత్రలో ఆకట్టుకున్న భారీ వినాయక ప్రతిమలు



క్రేన్ సహాయంతో నిమజ్జనం చేస్తున్న భక్తులు

● ప్రశాంతంగా ముగిసిన నిమజ్జన ఘట్టం

ఇచ్చోడ, సెప్టెంబరు, 18: పదకొండు రోజులపాటు మండపాల్లో పూజలందుకున్న వందలాది వినాయక విగ్రహాలు బుధవారం గంగమ్మ ఒడికి చేరాయి. ఇళ్ల, గల్లీ, కాలనీలలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాలు నిమజ్జనోత్సావానికి శోభాయాత్రగా వచ్చి బుధవారం స్థానిక ఎల్లమ్మకుంట చెరువులో నిమజ్జనం పూర్తి చేసుకున్నాయి. పట్టణంలోని రహదారులన్నీ అధ్యాత్మిక శోభతో వెల్లివెరిశాయి. యువత కేరింతలతో వాతావరణం సందడిగా కనిపించింది. వేడుక ప్రశాంతంగా ముగియడంతో ఇచ్చోడలో పోలీసు, వైద్యఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్తు తదితర ప్రభుత్వ విభాగాలు కీలకంగా పనిచేశాయి.



ప్రధాన రహదారిపై నృత్యాలు చేస్తున్న యువకులు



ఎమ్మెల్యే అనిల్‌ను సన్మానిస్తున్న గణేష్ మండలి సభ్యులు

గణనాథుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బోథ్, సెప్టెంబరు 18: మండలంలోని కనుగుట్ట గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గణేష్ మండలి వారి ఆహ్వానం మేరకు గణేష్‌ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు మాజీ సర్పంచ్ ఆకుల నడిపిన మృతి చెందడంతో ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామస్థులు ఉన్నారు.

ప్రారంభమైన ఉపాధి సామాజిక తనిఖీ

బోథ్, సెప్టెంబరు 18: మండలంలోని 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు పరిశీలిస్తున్నాయి. మండలంలో మొత్తం 31మంది సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత రెండేళ్ల క్రితం చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో కోట్లాది రూపాయల అక్రమాలు చోటు చేసుకోవడంతో రాష్ట్రస్థాయి అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించేందుకు గాను ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపారు. దీంతో సిబ్బంది ఈనెల 29 వరకు పనులను పరిశీలించనున్నారు. అయితే గతంలో చేపట్టిన పనులకు గాను జరిగిన అక్రమాలను బయట పెట్టకపోగా కిందిస్థాయిలో ఉన్న గ్రామస్థాయి కార్యదర్శులకు కొంతమంది సీసీలకు జరిమానాలు విధించి అక్రమాలకు కప్పి పెట్టారన్న విమర్శలున్నాయి. అక్రమాలకు పాల్పడ్డ పైస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకుండా అప్పటి జిల్లా ఉన్నతాధికారులు అక్రమాల చిట్టాను బయటపడకుండా చూడటం జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దు'

తలమడుగు, సెప్టెంబరు 18: పారిశుధ్య నిర్మూలనపై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీవో సుధీర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఖోడద్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం లోపించడం వల్ల అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పారిశుధ్య నిర్మూలనపై ఎవరూ కూడా నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఇందులో హెచ్ఎం కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

● సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల కేజీబీవీలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో పాల్గొని పరిసరాల శుభ్రత చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వనజ, ఏపీఓ వసంత్‌రావ్, కేజీబీవీ ఎస్‌వో రజిత, ఎఫ్‌వో, లత తదితరులున్నారు.

భీంపూర్ రూరల్: మండలంలోని మార్కగూడలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు చెత్త బుట్టలు, కూరగాయల మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఐకేపీ ఏపీవో ప్రసాద్, ఈసీ నరేందర్, సీసీ బాలాజీ ఉన్నారు.

బేషరతుగా క్షమాపణలు చెప్పాలి : కంది

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి, ఎంపీ, శివసేన ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. బుధవారం ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆశమ్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లినగేష్, గిమ్మసంతోష్‌లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, ఆవుల వెంకన్న, ఇమ్రాన్, నాయకులు పోరెడ్డి కిషన్, డి రాజేశ్వర్, దాసరి ఆశన్న, రఫిక్,ఖయ్యుం, దర్శనాల చంటి, అంజాద్ ఖాన్, ఉయికే ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి సంపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రతీఒక్కరు ఆధ్యాత్మికం వైపు పయనించాలి : బోథ్ ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, సెప్టెంబరు 18: ప్రతీఒక్కరు ఆధ్యాత్మికం వైపు పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని లఖంపూర్ గ్రామంలో గల రామగిరి మహరాజ్ ఆశ్రమంలో నిర్వహించిన జ్యోతి సంపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో చాలా మంది ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దైవచింతనతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నానక్‌సింగ్, దేవేందర్ రెడ్డి, ప్రతాప్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

● అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలకేంద్రంలోని భగత్‌సింగ్ యూత్ గణేష్ మండలి వద్ద బుధవారం నేరడిగొండ మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ మత సామరస్యంగా గణనాథుడికి సేవలు అందిస్తామని, తామంతా అన్నదమ్ముల వలే కలిసి కట్టుగా అన్ని పండుగలు జరుపుకుంటామన్నారు. అనంతరం మతసమరస్యాన్ని చాటిన మైనార్టీ యూత్ సభ్యులకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, గణేష్ మండలి సభ్యులు శాలువాతో సన్మానించారు. ఇందులో వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నానక్‌సింగ్, సద్దాం హుసేన్, సాయిరాం, సురేందర్, ప్రతాప్, లింబాజీ, తదితరులున్నారు.

'విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: కుల వృత్తులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో విశ్వకర్మల సమస్యలపై ప్రస్తావించడం జరిగిందన్నారు.

ఘనంగా వెదురు ప్రపంచ దినోత్సవం

ఉట్నూర్, సెప్టెంబరు 18: మండలకేంద్రంలోని మహేంద్ర సంఘం భవనంలో బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో వెదురు పారిశ్రామిక సంఘం భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌శంకర్ మాట్లాడుతూ మేదరి కులస్తులు వెదురు ద్వారా వివిధ రకాల వస్తువులను తయారు చేసుకుని వెదురుతో తయారు చేసిన పరికరాలను అమ్ముకొని నాటి నుంచి నేటి వరకు జీవనం సాగిస్తున్నారన్నారు. మహేంద్రులు సామాజికంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని ప్రభుత్వం మహేంద్ర కులస్థుల సంక్షేమం అభివృద్ధి కోసం చొరవ తీసుకోవాలని, సంఘ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలంను కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా వెదురు మొక్కలను నాటారు. ఇందులో సంఘం సభ్యులు పాట్కోట్ మహేష్, ఉరేరవి, నర్సయ్య, తిరుపతి, సురేష్, రాజశేఖర్, దినేష్, సాయి, తదితరులున్నారు.



ఆదిలాబాద్‌లో నిమజ్జనానికి వరుస కట్టిన గణపయ్యలు



పెన్‌గంగాలో క్రేన్ సహాయంతో గణనాథులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

గంగమ్మా.. నేనొస్తున్నా..!!

నవరాత్రుల పాటు.. భక్తుల పూజలందుకున్న గణనాథులు బుధవారం గంగమ్మ ఒడికి చేరాయి. మంగళవారం మధ్యాహ్నం మండపాల నుంచి భక్తుల కోలాహలం మధ్య శోభాయాత్రగా బయలుదేరిన వినాయకులు మరుసటి రోజు వరకు గంగమ్మ దరికి చేరాయి. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పెన్‌గంగా నది వంతెన వద్ద 'గంగమ్మా.. నేనొస్తున్నా' అంటూ పదుల సంఖ్యలో వరుస కట్టిన చిత్రం చూపరులను ఆకట్టుకుంది. అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్‌ల ద్వారా భారీ గణనాథుల ప్రతిమలను భక్తిశ్రద్ధలతో నదిలో నిమజ్జనం చేశారు. (- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సభ్యులు బండరి వామన్, గెడం మాధవ్, పూసం ఆనంద్, కొత్తపల్లి సంజీవ్, మహిపాల్, రాజు పాల్గొన్నారు.

'ఐసీడీఎస్‌ను యధావిధిగా కొనసాగించాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేలా అంగన్‌వాడీ కేంద్రంలో మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కిరణ్ అన్నారు. ఐసీడీఎస్‌ను యధావిధిగా స్వతంత్రంగా కొనసాగించాలన్నారు. ఈ విషయమై బుధవారం ఆదిలాబాద్ ఐసీడీఎస్ పీడీ సబితకు యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: కార్మిక వెల్ఫేర్ బోర్డు అడ్వైయిజరి కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కిరణ్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాల అమలును బీమా కంపెనీలకు ఇవ్వొదని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించని పక్షంలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని వారు పేర్కొన్నారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం



శోభాయాత్రలో భారీ గణనాథులు

● మంగళవారం రాత్రి అంతా వైభవంగా శోభాయాత్ర
● బుధవారం ఉదయం ఉత్తమ వాహినిలో ముగిసిన గణనాథుడి నిమజ్జనం

ఖానాపూర్, సెప్టెంబరు 18 : నవరాత్రుల పాటు పూజలు అందుకున్న వినాయకుడికి భక్తులు వీడ్కోలు పలికారు. ఖానాపూర్‌లో మంగళవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైన వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర బుధవారం ఉదయం 11 గంటల వరకు సాగింది. పలు గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పట్టణంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిల ఆధ్వర్యంలో పకడ్బందీ భద్రత ఏర్పాట్లను చేశారు. భారీ గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఉత్తర వాహిని గోదావరి నది తీరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన శోభాయాత్రలో ఇక్కట్లు కలగకుండా రోడ్లపై గుంతలను ముందస్తుగానే పూడ్చి వాహనాలు గోదావరి తీరం వరకు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేశారు. మొత్తానికి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా ఖానాపూర్ పట్టణంలో ఈ ఏడాది



గోదావరి నది తీరంలో నిమజ్జనానికి ముందు..

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

ముగిసిన గణేష్ నిమజ్జనం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 18 : నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన వినాయక నిమజ్జనం బుధవారం ముగిసింది. వినాయక సాగర్ చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక పర్యవేక్షణలో అధికార యంత్రాంగం ప్రశాంత సమన్వయ కృషితో నిమజ్జన ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది.

రాహుల్‌గాంధీపై

వివాదస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన

● జాతీయ రహదారిపై రాస్తారోకో ● ప్రధానరోడ్డు మార్గాల్లో నిరసన ప్రదర్శనలు ● బీజేపీ నేత తన్వీందర్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం



భైంసా బస్టాండ్ ఎదుట
నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

భైంసా, సెప్టెంబర్ 18 ; రాహుల్‌గాంధీపై ఢిల్లీ బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీంధర్ సింగ్ చేసిన వివాదాస్పద, అభ్యంతరకర వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం భైంసా పట్టణ, మండల పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. భైంసా-నాందేడ్ జాతీయ రహదారి మార్గంలోని మాంజ్రీ గ్రామం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో చేపట్టాయి. ఢిల్లీ బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీంధర్‌సింగ్ దిష్టిబొమ్మకు శవయాత్ర చేపట్టి జాతీయ రహదారిపై దహనం చేశారు. ఇందులో ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్, కాంగ్రెస్ ప్రతినిధులు ఫారుఖ్‌అహ్మద్, ఆలూరి ప్రశాంత్, జావేద్‌ఖాన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. భైంసా పట్టణ పరిధిలో కాంగ్రెస్ ప్రతినిధులు శంకర్‌చంద్రే, బెజ్జంకి ముత్యంరెడ్డి,గజేందర్‌ల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రధానరోడ్డు మార్గంలో ఢిల్లీ బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీందర్‌సింగ్ అభ్యంతరకల వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తన్వీందర్ సింగ్ చిత్ర పటాలను దహనం చేశారు. తన్వీంధర్‌పై చర్యలు తీసుకోవాలని, లేని యెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని కొత్త బస్టాండ్ ముందర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి మాట్లాడుతూ... ఏఐసీసీ నాయకులు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని బయటకు వస్తే చంపేస్తానని బీజేపీ నాయకుడు తన్వీందర్‌సింగ్ బహిరంగంగా హెచ్చరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్న విషయాన్ని బీజేపీ నాయకుడు మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి మోదీతో పాటు హోం మంత్రి అమిత్‌షా కనీసం స్పందించలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీపై తన్వీందర్‌సింగ్ వ్యాఖ్యలను ఖండిస్తూ వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, కిషన్‌పటేల్, కిషన్‌పతంగి, ముదుగులశంకర్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన



లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో
చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఖానాపూర్, సెప్టెంబరు 18 : కడెం మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రం 2,3లలో బుధవారం పలువురు చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మహిళలకు స్థానిక అంగన్‌వాడీ టీచర్లు కోడి గుడ్లు, ఆకుకూరలు, పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఇంట్లో గర్భిణీలకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణీలు వైద్యుల సూచన మేరకు వ్యాయామం సైతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ధర్మసోత్ శ్రీలత, నేదూరి విజయ నిర్మల సహా పలువురు బాలింతలు, గర్భిణీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మడిపల్లి భద్రయ్యకు పలువురి నివాళి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 18 : నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్వర్గీయ మడిపల్లి భద్రయ్యకు జిల్లా కవులు, కళాకారులు ఆయన విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. తృతీయ వర్ధంతి సందర్భంగా శాస్త్రినగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. సాహిత్య రంగానికి భద్రతయ్య చేసిన సేవలు కొనియాడారు. భద్రతయ్య ఇందిరా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భద్రయ్య కుటుంబ సభ్యులు, కవులు డాక్టర్ కృష్ణంరాజు, బొందిడి పురుషోత్తం రావు, పోలీసు భీమేష్, టాక్స్ కన్సల్టెంట్ నూకల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దొంతుల సురేష్

కుభీర్, సెప్టెంబరు 18 : పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మండలంలోని పల్సి ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దొంతుల సురేష్‌ను నియమిస్తు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు ఉమాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కుభీర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురంశెట్టి సాయికుమార్, బాగుల చంద్రశేఖర్, అసోషియేట్ అధ్యక్షులు కట్కం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎర్రన్న, సభ్యులు సిలారి రాజశేఖర్, మధుసూదన్, ఎల్లన్న, సంజీవ్ , లింగమూర్తి, సీఆర్‌పీ గంగాధర్ తదితరులున్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

దిలావర్‌పూర్, సెప్టెంబరు 18 : నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. బుధవారం స్వచ్ఛత హీ సేవలో భాగంగా సిర్గాపూర్, దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు, విద్యార్థులతో ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలన్నారు. సిర్గాపూర్ ప్రభుత్వ పాఠశాలలో, దిలావర్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో స్వచ్ఛత హీ సేవ చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, ఏపీవో దివ్య రెడ్డి, ఏపీఎం సులోచన రెడ్డి, కేజీబీవీ ఎస్‌వో అపర్ణ, గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఉపాధ్యాయుల టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యను ప్రతిష్టం చేయాలి

సారంగాపూర్, సెప్టెంబరు 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను పటిష్టం చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికాంత్ అన్నారు. బుధవారం టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు బీరవెల్లి తదితర పాఠశాలలో సభ్యత్వ నమోదును చేశారు.

సమ్మె బాటలో ఆరోగ్యశ్రీ సిబ్బంది

● అత్యవసర వైద్యసేవలకు అంతరాయం



నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ఆరోగ్య శ్రీ సిబ్బంది

భైంసా, సెప్టెంబరు 18 : దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఆరోగ్యశ్రీ సిబ్బంది బుధవారం సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లాలో దాదాపుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. అత్యవసర వైద్యసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమ్మె బాట పట్టిన ఆరోగ్యశ్రీ సిబ్బంది డివిజన్ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్‌లో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్యశ్రీ సిబ్బంది ప్రతినిధులు మాట్లాడుతూ తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వేతనంగా నెలకు రూ.22,750 చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీలో వేతనం రూ.35వేలకు పెంచటం, ఆరోగ్యకార్డులు అందించటం, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి పరిహారాన్ని అందించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టినట్లుగా వెల్లడించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని 30 మందికి పైగా ఆరోగ్యశ్రీ సిబ్బంది విధులను బహిష్కరించామని తెలిపారు. ప్రభుత్వం కాలయాపనకు తావులేకుండా తమ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర యూనియన్ ఆదేశాలకు అనుగుణంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

● ఆసుపత్రులపై ప్రభావం..

జిల్లాలోని 6 ప్రభుత్వ, 8 ప్రైవేట్ ఆసుపత్రులలో కలిపి మొత్తం 14 ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉన్నాయి. సంబంధిత ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సిబ్బంది రోగులకు సేవలు అందిస్తున్నారు. సమస్యల పరిష్కారం, డిమాండ్ల నెరవేర్చుకునేందుకు గాను ఆరోగ్య శ్రీ సిబ్బంది సమ్మె బాట పట్టడంతో రోగులకు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. అత్యవసర వైద్య సేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. .


ఎస్‌జీఎఫ్ నిర్మల్ జిల్లా స్థాయి

అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

ఖానాపూర్, సెప్టెంబరు 18 : ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఖానాపూర్ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. లాంగ్ జంప్ విభాగంలో, షార్ట్ పుట్ విభాగంలో రాఘవ గోల్డ్ మెడల్ సాధించగా డిస్కస్ త్రో విభాగంలో కార్తీక్ సిల్వర్ మెడల్, లాంగ్ జంప్ విభాగంలో సంతోష్ సిల్వర్ మెడల్, ఏబినైజర్ 100 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ప్రణయ్ 200ల మీటర్ల విభాగంలో సైతం సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. విశ్వేశ్వర్ తెలిపారు. జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన నలుగురు విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం రాణించి మెడల్స్ సాధించాలని ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వార్డెన్ లాలిత్య, ఉపాధ్యాయులు చలాం, నరేందర్, సీహెచ్. అనిల్ తదితరులున్నారు.

20న అండర్ 14, 17 బ్యాడ్మింటన్ సెలక్షన్స్

నిర్మల్, సెప్టెంబరు 18 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ సెలక్షన్స్ అండర్ 14, అండర్ 17 బాలబాలికలు జిల్లాస్థాయి సెలక్షన్స్ నిర్మల్ క్లబ్‌లో నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్ క్లబ్ నందు రిపోర్ట్ చేయాలని స్కూల్ గేమ్స్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ తెలిపారు.



'పీడీఎస్‌యూ సభను జయప్రదం చేయాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: ఈనెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే పీడీఎస్‌యూ 50 వసంతాల సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ సభ పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు విద్యా రంగ సంస్థల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

గుడిహత్నూర్ మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీ

అడ్డగోలు.. దందా!

- జిల్లాలోని నర్సరీలలో విచ్చలవిడిగా నారు వ్యాపారం
- అయినా.. ఉలుకుపలుకు లేని ఉద్యానవన శాఖ
- నాసిరకం కూరగాయల నారుపై అనుమానాలు
- రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- కొరవడిన పర్యవేక్షణ.. నష్టపోతున్న అన్నదాతలు



ఆదిలాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచ్చలవిడిగా నర్సరీలను ఏర్పాటు చేసి వ్యాపారులు అడ్డగోలు దందాను కొనసాగిస్తున్నారు. అయినా ఉద్యానవన శాఖకు ఉలుకుపలుకే లేదన్న విమర్శలు వస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో కూరగాయల నారు వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా మిర్చి, టమాట, వంకాయ, గోబీ, ఇతర కూరగాయల పంటలకు సంబంధించిన నారు ను విక్రయిస్తూ.. వ్యాపారులు కోట్ల రూపాయల దందాను కొనసాగిస్తున్నారు. కానీ సరైన దిగుబడులు రాకపోతే ఎవరు బాధ్యులనే ప్రశ్నలకు సరైన సమాధానం దొరకడం లేదు. నష్టపరిహారం కూడా పొందడం కష్టంగా కనిపిస్తోంది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటల సాగు మొదలుకా గానే నర్సరీలను పర్యవేక్షణ చేసి.. వ్యాపారులు నిబంధనలు పాటించే విధంగా ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, మావల మండలాల్లో 20 నుంచి 30 వరకు నర్సరీలు ఉన్నాయి. కానీ వీటిలో కొన్ని నర్సరీలకు మాత్రమే పూర్తిస్థాయిలో అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొన్నింటికి లీజు అగ్రిమెంట్ పేరిట అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజన రైతుల పేరిట వ్యాపారులు నారు వ్యాపారం చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెడీమెడ్‌గా దొరికే నర్సరీ నారుపై రైతులు కూడా ఆసక్తి చూపడంతో నర్సరీ వ్యాపారం మరింత ఊపందుకుంటోంది. కానీ కొన్ని సందర్భాల్లో దిగుబడులు రాక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అక్రమంగా సాగుతున్న నారు నర్సరీలపై అధికారులు దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

హైబ్రిడ్ పేరుతో అమ్మేస్తున్నారు..

మార్కెట్‌లో దొరికే హైబ్రిడ్ రకాల పేరుతో కూరగాయల నారును అమ్మేస్తున్నారు. చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్టుగా మారడంతో ఆశించిన దిగుబడులు రావడం లేదని రైతులు చెబుతున్నారు. నర్సరీల్లో పెంచిన హైబ్రిడ్ నారు మొక్కలను నాటితే అధిక దిగుబడులు వస్తాయని నమ్మిస్తున్నారు. అసలు ఏ రకం విత్తనాలు మేలైనవి? ఎలాంటి సాగు మెలకువలు తీసుకోవాలి? ఏ సమయంలో నాటుకోవాలి? ఎలాంటి నేలలు అనుకూలం అనే విషయాలపై రైతుల్లో అసలు అవగాహనే లేకుండా పోయింది. అలాగే సాగు పద్ధతులపై కనీస అవగాహన లేకపోవడంతో ఆశించిన దిగుబడులు రావడం లేదంటున్నారు. మేలైన హైబ్రిడ్ విత్తనాలతో నారు మొక్కలను పెంచుతున్నట్లు నర్సరీ నిర్వాహకులు చెబుతున్న దిగుబడులు రాకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు. దీనికి తోడు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు కరువవుతున్నాయి. చివరికి అధిక దిగుబడుల మాట దేవుడెరుగు గానీ.. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

పోటాపోటీగా నర్సరీల ఏర్పాటు

జిల్లాలో పోటాపోటీగా కొందరు నర్సరీలను ఏర్పాటు చేస్తూ యథేచ్ఛగా నారు వ్యాపారం చేస్తున్నారు. జిల్లా నుంచే సరిహద్దు మహారాష్ట్ర, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు కూరగాయల నారును సరఫరా చేస్తున్నారు. అయితే చాలా నర్సరీలకు సరైన అనుమతులు లేవని తెలుస్తుంది. అయినా పోటాపోటీగా నర్సరీలను ఏర్పాటు చేస్తునే ఉన్నారు. దీంతో ప్రతియేటా జిల్లాలో నర్సరీల సంఖ్య పెరుగుతూనే వస్తుంది. ఇవ్వన్నీ ఏజెన్సీ ప్రాంతంలోనే ఉండడంతో అనుమతులు ఇచ్చేందుకు ఉద్యానవన శాఖకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఏజెన్సీ చట్టాల ప్రకారం గిరిజన రైతులకే అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కానీ, గిరిజనేతర రైతులతో పాటు కొందరు వ్యాపారులు నర్సరీల ను ఏర్పాటు చేయడం కొంత వివాదాస్పదంగా మారింది. గతంలోనే ఈ విషయమై జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తుంది. 2017 నూతన నర్సరీల చట్టం ప్రకారం నర్సరీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఎక్కడా నిబంధనలు పాటించినట్లు కనిపించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

అనుమతులు తప్పనిసరి

నర్సరీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. భూ యాజమాన్యపు హక్కులు కలిగి ఉండి నర్సరీలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కౌలుదారులైతే రిజిస్టర్ చేసిన లీజు అగ్రిమెంట్ కలిగి ఉండాలి. నర్సరీ ఏర్పాటు చేసే ప్రాంతంలో మట్టి, నీటి నమునా పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. లైసెన్స్ పొందిన కంపెనీల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తనాలు విత్తే సమయం నుంచి రైతులకు విక్రయించే వరకు అన్ని వివరాలను రికార్డుల్లో క్రమం తప్పకుండా నమోదు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులతో పాటు రైతులకు విక్రయించిన నారు బిల్లులను కూడా జాగ్రత్తగా భద్రపర్చాలి. బిల్లులు లేకుండా విక్రయిస్తే చట్టరీత్యా నేరమవుతుంది. నర్సరీలో పెంచిన మొక్కలు, రైతులకు విక్రయించిన మొక్కల వివరాలను రికార్డుల్లో నమోదు చేసి అధికారుల పర్యవేక్షణలో చూపాల్సి ఉంటుంది. కానీ ఎక్కడ ఇలాంటి నిబంధనలను పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో వ్యాపారులు చెప్పిందే లెక్కాగా మారిందంటున్నారు. అంతేకాకుండా నాసిరకం నారుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి సంబంధించి ఎవరికి చెప్పుకోవాలనో తెలియక అన్నదాతలు సతమతమవుతున్నారు.



నర్సరీలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం

: సుధాకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి

జిల్లాలో నిర్వహిస్తున్న నర్సరీలను నిరంతరంగా పర్యవేక్షణ చేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 25 నర్సరీలకు అనుమతులు ఉన్నాయి. మరో ఐదు నర్సరీలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ఇటీవలే దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కొన్ని నర్సరీలలో నాణ్యతలేని విత్తనాలతో నారును పెంచుతున్నట్లు గుర్తించి తొలగించాం. నర్సరీ నిర్వాహకులకు హెచ్చరికలు కూడా జారీ చేశాం. కొనుగోలు చేసిన విత్తనాల వివరాలతో పాటు రైతుల వివరాలను కూడా రికార్డుల్లో నమోదు చేయాలని సూచిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం

నేడు రాజకీయ నాయకులతో సమావేశం : ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 18: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాజకీయ పక్షాల నాయకులతో మండలకేం ద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నందున రాజకీయ పక్షాల నాయకులు హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో ఆయా గ్రామాల్లోని ఓటరు జాబితాపై చర్చించనున్నట్లు వివరించారు. దీనికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే సమావేశంలో స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభం : సుగుణ

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంను పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ప్రారంభించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మతో కలిసి ఆన్‌లైన్‌లో సభ్యత నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు దేశెట్టి ప్రభావతి, లతా, ఉయికే ఇందిర, సోనియామంథని, జుబేదా, లక్ష్మి, సబీనా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ఎస్టీ సంక్షేమ హాస్టల్‌లను బుధవారం ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి ప్రేమ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాక హాస్టల్‌లో ప్రాంగణంలో ఉన్న ప్రహరీ ప్రమాదకరంగా ఉందని, తక్షణమే గోడ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



అంబులెన్స్‌లో ప్రసవమైన మహిళ

108లో మహిళ ప్రసవం

నార్నూర్, సెప్టెంబరు 18: గాదిగూడ మండలంలో 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కోలాంగూడ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లి నాగిని అనే గర్భిణీకి బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. దీంతో వైద్య నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో దుబ్బగూడ దగ్గర నొప్పులు అధికమై అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది అని పైలట్ ఆత్రం లచ్చు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

- నాణ్యమైన విద్యతో పోషక విలువలు గల ఆహారం అందించాలి : పీవో ఖుష్బుగుప్త
- విద్య, వైద్యం, భోజనంపై అధికారుల వద్ద వివరాల సేకరణ



హస్నాపూర్ ఆశ్రమ పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న పీవో



ఖోఖో జట్టుకు ఎంపికైన గిరిజన విద్యార్థులతో..

ఉట్నూర్, సెప్టెంబరు 18: మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హస్నాపూర్‌లోని బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు ఉట్నూర్, కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ఆశ్రమ ఆదర్శ క్రీడా పాఠశాలను పీవో ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెను ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో స్టడీ అవర్స్‌లో ఉన్న విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఔషధాల రిజిస్టార్ పరిశీలించి.. ఔషధాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు వండి పెడుతున్న ఆహారం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఏమైనా మరమ్మతులు ఉంటే తమకి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● జాతీయ ఖోఖో పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

ఉట్నూర్: జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖోపోటీలలో పాల్గొన డానికి ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల ఆరుగురు గిరిజన విద్యార్థులు రాష్ట్రజట్టుకు ఎంపిక కావడం శుభపరిణామం అని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు సిడాంశంకర్, కుంర సురేందర్, రాథోడ్ శివసాయి, ఆత్రం యాదవ్‌షవ్, ఆత్రం శివచరణ్, పెందూరు హనుమంతులు రాష్ట్ర జట్టు తరపున జార్ఖండ్‌లో అక్టోబర్ 29 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. గురువారం నుంచి ఖమ్మంలో ప్రారంభంకానున్న శిక్షణ శిబిరంలో పాల్గొని అక్కడి నుంచి నేరుగా జార్ఖండ్ బయలుదేరుతారన్నారు.అదే విధంగా రాష్ట్ర ఖోఖో జట్టుకు ఉట్నూర్ క్రీడా పాఠశాల కోచ్ శివకృష్ణ నియమితులయ్యారన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన ఆరుగురు గిరిజన విద్యార్థులతో పాటు కోచ్ శివకృష్ణను ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సన్మానించారు. జాతీయ స్థాయిలో కూడా తెలంగాణ జట్టు తరపున ఆదిలాబాద్ జిల్లా ఖ్యాతి నిలబెట్టాలని పీఓ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్, హాకీ కోచ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్: బోస్ ఫెలోషిప్‌లో ఇచ్చిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత్‌దేకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోస్ ఫెలోషిప్‌ప్రోగ్రాం ద్వారా 34 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవోను కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు స్వాగతం పలికారు. అనంతరం పీవో మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ప్రైమరీ స్కూల్లో విద్యా ప్రమానాలను పెంపొందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా బోస్‌ఫెలోషిప్ వాలంటీర్లు జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్ నేర్చుకోవాలని, దీనితో పాటుగా ఐటీడీఏ ఆధ్వర్యంలో సర్టిఫికేట్ అందించడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది పీవో ఖుష్బుగుప్తను సన్మానించి, పలు సమస్యలపై ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, పీడీ అనిత, అధ్యాపకులు నర్సింగ్ రావు, రాజశేఖర్, కిషన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సోనాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బోథ్, సెప్టెంబరు 18: మండలంలోని సోనాల గ్రామాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఫణీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఆయన పర్యవేక్షించారు. డ్రై డే సందర్భంగా చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక సోనాల గ్రామ పంచాయితీ మోడల్ ప్రజా ఫిర్యాదు విభాగం కోసం ఎంపికైనందున ఫిర్యాదుల విభాగం ఏర్పాటు గదిని పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని రిజిష్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, బిల్ కలెక్టర్, తదితరులు ఉన్నారు.

● పారివుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి : డీఎల్‌పీవో

నార్నూర్, సెప్టెంబరు 18: గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తడిహత్నూర్ నార్నూర్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించారు. పారిశుధ్య పనులు, ఇళ్ల టాక్స్, పంచాయతీ రికార్డులు, తదితర అంశాలను పరిశీలించారు. వర్షాకాలం సీజన్ పట్ల పారిశుధ్య పనుల అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులకు పంచాయతీ సిబ్బందికి సూచించారు. వారానికి డ్రైడే చేపట్టి తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంపింగ్ యార్డులకు తరలించాలని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీవో జవార్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న అధికారి

రీజనల్ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ప్రారంభం



బోర్డు మీటింగ్ కార్యాలయాన్నిప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్‌లో నూతనంగా నిర్మించిన రీజనల్ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ప్రారంభించారు. సైనిక్ భవనం ప్రారంభం అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో రీజనల్ సైనిక్ వెల్ఫేర్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. సైనిక్ వెల్ఫేర్ కార్యక్రమాలైన ఐడీ కార్డు జారీ చేసే విధానం, హౌస్ ప్లాట్స్, అగ్రికల్చర్ ల్యాండ్, క్యాంటీన్ ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, జిల్లా యువజన క్రీడా, సైనిక్ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి బి.తిరుమల, జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, లీడ్ బ్యాంక్ మేనేజర్, పరిశ్రమల శాఖ పర్యవేక్షకులు, మాజీ సైనిక సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, ఉపాధ్యక్షులు అశోక్, సెక్రెటరీ మోహన్, క్యాషియర్ దేవన్న, మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, డీబీ చారి, సత్తయ్య, మధు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఆదిలాబాద్: ఈనెల 13న ప్రచురించబడిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దీనికి సంబంధించి అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందని, తుది ఫొటో ఎలెక్టోరల్ జాబితాను ఈనెల 28న ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.